# నాకు చచ్చిపోవాలని ఉండేది!

కిలకిలా నవ్వు విన్పిస్తోంది పెరట్లోనించి, శర్మకి! మామిడి చిగుళ్ళు మేసి మత్తెక్కిన కోయిల కొత్త రాగం ఆలపిస్తోన్నట్టు .... వర్షరుతువులో సెలయేరు గలగలా ప్రవహిస్తోన్నట్టు.... బావి దగ్గిర నీళ్ళు తోడుకుంటోన్న వరలక్ష్మి నవ్వు, గిలక చప్పుడుని కూడా మించి శర్మ చెవుల బడుతోంది. నిద్రమత్తు ఒదిలించుకుంటూ బద్ధకంగా పక్కమీద లేచి కూర్చున్నాడు శర్మ, కిటికీ లోంచి పెరట్లోకి చూస్తూ. సాయంకాలపు నీరెండలో వరలక్ష్మి కట్టిన కనకాంబరం చీర ఎర్రగా కాంతిగా మెరుస్తోంది. నూతి దగ్గిర జానకిని కూడా చూశాడు శర్మ. ఆ ఇద్దరి మాటలూ శర్మ చెవులబడుతున్నాయి.

"మీ ఆయన ఊళ్ళో లేనప్పుడు నీకు పువ్వు లెందుకేమిటి?" హాస్యంగా అంది జానకి.

వరలక్ష్మి మళ్ళీ నవ్వింది గలగలా — "బాగుంది. ఆయన లేకపోతే నేను తిండి తినొద్దా? నాకు మల్లె పువ్వులంటే చాలా ఇష్టం. ఎవరి సంతోషం వాళ్ళదీ. రాత్రంతా భయంతో జాగారం చేస్తూ కూర్చున్నానేమో, ఇవ్వాళ పగలంతా ఒళ్ళెరక్కుండా పడుకున్నాను. పూలకుర్రాడు వీధిలోకి రావటం నాకు తెలీనే తెలీదు. కాస్త నన్ను లేపితే నీ సొమ్మేంపోయేది? నేనూ కొనుక్కునే దాన్నిగా?"

"ఈ సారికి నిష్ఠూరం వెయ్యకు వరాలూ! నీ మాట మర్చిపోయాలే"

అక్కడి కామాట మార్చేస్తూ మళీ&ళ అంది జానకి "పోనీ రాత్రి నీకంత భయంవేస్తే నన్ను తోడు పిలవక పోయావా? వచ్చి పడుకునే దాన్నిగా?"

"అమ్మో! బావగారు నన్ను తిట్టుకుంటేనో" ఫక్కు మంది వరలక్ష్మి — "అంటావుగానీ నువ్వు మాత్రం రాత్రిపూట ఆయన్ని వొదిలేసి వస్తావేమిటి?"

"చాల్లెద్దూ, నీ మాటలూ నువ్వూనూ. ఒక్క రోజుకి మొగుడు పారిపోతాడా ఏమిటి?"

"పారిపోవాలంటే ఎన్ని రోజులు కావాలేమిటి?"

"అబ్బ! నీతో మాట్లాడలేనుగానీ మీ ఆయన రావటం ఎప్పుడు?"

"ఇంకో రెండు మూడు రోజులు వుంటారను కుంటాను. ఏమో బాబూ! ఆయన వచ్చేవరకూ నాకు గండమే."

"ఛ! అంత పిరికితనమైతే ఎలాగ?"

"నీకేం, మొగుడితో ముచ్చట్లాడ్తూ కూర్చుని అలాగే చెప్తావు. గ్రహచారం చాలకపోతే ఏ రోజు ఎలా గడుస్తుందో ఎవరికి తెలుస్తుంది? ఆడదాన్ని ఒక్కదాన్నీ వున్న అలుసు చూసి, ఏ పోకిరీవాడో ఇంట్లో జొర బడితే...?" మాట పూర్తి చెయ్యకుండానే కిలుక్కు మంటూ నవ్వేసింది వరాలు, అది నవ్వే విషయంలాగ.

శర్మ ఉత్సాహంగా పక్కదిగి కిటికీ దగ్గరకు నడి చాడు. వరలక్ష్మి కట్టిన చీర ఎరుపురంగు, శర్మ కంటి పాపల నిండా అలుముకుంది.

జానకి కూడా సన్నగా నవ్వుతూ "సంసార్ల ఇళ్ళల్లో జొరబడటానికి ఎవడికమ్మా అన్ని గుండెలూ?" అంది.

"ఎక్కడినించో రావాలా ఏమిటక్కయ్యా? ఎవరి కెప్పుడే బుద్ధి పుడుతుందో ఏం చెప్పగలం?"

ఆశ్చర్యపడుతూ చూసింది జానకి — "అంటే? ఎవర్ని గురించి అంటున్నావు నువ్వు?"

"నీకు కోపం వచ్చినట్టుందే! భలేదానివి! మాట వరసకి అంటే...."

"ఏం మాట వరస? బుద్ధి తక్కువ వాడెవడైనా ఇంట్లో జొరబడితే చేతకానిదానిలా నోరు మూసుకుని వూరుకుంటావు కాబోలు!"

"ఊరుకోక వురెట్టుకుంటానా? అంత గ్రహచారం చుట్టుకుంటే ఆడదేం చేస్తుందక్కా? అల్లరి చేసుకుంటే ఎవరికి నష్టం?"

"చాల్లే! ఏంటా మాటలు?"

"ఎందుకంత ఆశ్చర్యపోతావు? ఆడదే పిల్చిందని వాడు ప్రచారం చేస్తే? దీని అలుసులేందే వాడు అంత తెగిస్తాడా అంటారు నలుగురూ."

"ఏమో వరాలూ! చాలా చిత్రంగా మాట్లాడు

తున్నావు!" అంది జానకి మొహం చిట్లిస్తూ. "సరేలే, కబుర్లలో పడి నించున్నాను. బోలెడు పనుంది. నీకేం? ఒక్కదానివి, ఒక ముద్ద ఉడకేసుకుంటావు. వస్తా నమ్మా!" జానకి బిందె భుజం మీదకి ఎత్తుకుని వెళ్ళి పోయింది.

జానకి వెళ్ళగానే తల తిప్పి వారగా చూసిన వర లక్ష్మికి కిటికీ దగ్గర తారట్లాడుతున్న శర్మ స్పష్టంగా కన్పించాడు. గమ్మున తలతిప్పి వరాలు కూడా బిందె నడుం మీదకి ఎత్తుకుని నూతి దగ్గర్నించి కదిలింది. వెళ్తూ వెళ్తూ ...... ఇంటి మెట్లెక్కుతూ .... మళ్ళీ వెనక్కి తిరిగిచూస్తే, .... టవలు భుజంమీద వేసుకుని నూతి దగ్గరికి వెళ్తోన్న శర్మ వెనక్కి తిరిగి చూస్తూ .... గబగబా ముందుకు నడుస్తూ కన్పించాడు.

నాలుగు వాటాల లోగిలి అది.

జానకి భర్త ముకుందం, తాలూకా ఆఫీసులో ఉద్యోగి. అతన్ని గురించి ఇంటా బయటా ఎవ్వరికీ చెడ్డ అభిప్రాయం లేదు, జానకికి కూడా. పధ్నాలుగు పదిహేనేళ్ళ కొడుకు వున్న ఆ దంపతుల్లో ఏ విధం గానూ చిన్నతనపు చేష్టలు కన్పించవు. పిల్లలేమిటో .... వాళ్ళ చదువులేమిటో ... సంసారమేమిటో .... వాళ్ళ ధోరణి వాళ్ళదే.

రెండో వాటా వాళ్ళు శకుంతలా శర్మా. శర్మని గురించి పైవాళ్ళకి తెలిసింది తక్కువేగానీ, శకుంతలకి క్షుణ్ణంగానే తెలుసు. భర్త బుర్రలో వున్న చిత్త చాంచ ల్యాన్ని ఏనాడో కనిపెట్టింది శకుంతల. భర్త దృష్టిలోకి పరాయి ఆడవాళ్ళ గాలికూడా జొరబడకుండా భర్తని ఆకట్టి చూసుకుంటూ వుంటుంది. ఎక్కడెన్ని వేషా లేసినా శర్మ, భార్య దగ్గర అతి నమ్మకస్తుడిలాగా ప్రవ ర్తిస్తూ వుంటాడు.

మూడో వాటా వాళ్ళు — వరలక్ష్మీ రామ్మూర్తీ. వర లక్ష్మి పరాయి మగవాళ్ళ గురించి భయపడిందిగానీ, భర్త గురించి కాదుగా?

నాలుగో వాటాలో ఇంటి మామ్మగారు పదహారేళ్ళ మనవణ్ణి పెట్టుకుని చదివించుకుంటూ ఒకరి జోలీ శొంఠీ లేకండా కాలం గడుపుతోంది.

"వరాలు ఎవర్ని గురించి అంత మాటన్నదబ్బా!" అంటూ జానకి చాలాసేపు తనలో తను తర్కించు కుంది. తన భర్తమీద జానక్కి ఎన్నడూ అపనమ్మకం లేదు. తనకే కాదు, అతని మీద ఎవరికీ అపనమ్మకం వుండదనే జానకి విశ్వాసం. 'ఇక, ఇరుగు పొరుగు నున్న పరాయి మగవాడు శర్మగారే. ఆయన్ని గురించి అన్నదా యేవిటి? పాపం ఆయన కూడా చూపులకు కాస్త దురుసుగా కన్పిస్తాడుగానీ, అతనైనా ఏమంత మంచీ మర్యాదాలేని మనిషి కాడు. ఓసారెప్పుడో తను నూతి దగ్గిర తారసపడబోతే వస్తూన్న వాడల్లా గిరు క్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. ఇంకెవర్ని గురించి అంది వరాలు? ఏ సంసారి మాత్రం అంత బుద్ధి తక్కువగా ప్రవర్తిస్తాడు? భర్తని ఊరుమీదికి విడిచి పెట్టటానికి శకుంతల అంత అల్లరి చిల్లరి మనిషా ఏమిటి? భార్య పుట్టింటికిపోతే మాత్రం, అతనికి ఆ మాత్రం వివేకం లేదూ? వరాలు ఎప్పుడూ అంతే. వెకిలి దానిలాగా మాట్లాడుతుంది. ఆ వాగుడికి లెక్కేవిటి?' అలా అనుకుంటూ జానకి ఆ ఆలోచనలు కట్టి పెట్టింది.

నీళ్ళబిందె ఎత్తుకుని ఇంట్లోకి వచ్చింది మొదలూ వరలక్ష్మి మనసంతా చికాకైపోయింది. తను వెకిలి దానిలా మాట్లాడిందో యేమో! జానకి కనిపెట్టిందో లేదోగానీ, శకుంతలగారి వాటాలో, పడగ్గది కిటికీ దగ్గిర శర్మ గారు తన మాటలన్నీ వింటూనే వున్నాడు. అయినా తను నోరు మూసుకోకుండా వెనకనించి ఎవరో ప్రోత్సహిస్తున్నట్టు హుషారుగా మాట్లాడేసింది. సిగ్గులేకుండా పకపకలాడింది. నూతి దగ్గిర కబుర్లూ, నవ్వులూ తల్చుకుంటూ తనేమిటో మర్యాదలేని మనిషిలా ప్రవర్తించినట్టు నొచ్చుకుంది వరలక్ష్మి. జానకి మొహం చిట్లించడం తల్చుకుంటే, భలే సిగ్గే సింది వరాలుకి.

పొయ్యి రాజుతోంటే, ఎసరు పడేద్దామని లేచింది. .... అంతలోనే మనస్కరించక 'ఈ పూటకి కాసిని పాలుతాగి పడుకుంటే సరి' అని స్వగతం చెప్పుకుని పొయ్యిలో నిప్పులు కిందకిలాగి వాటినిండా నీళ్ళు జిమ్మింది. 'అయ్యో! కాసిని నీళ్ళయినా పడేశాను గాదు. స్నానానికి బాగుండేది' అంటూ పశ్చాత్తాప పడింది. నిప్పులు పొయ్యిలోకి గెంటి లేస్తూ 'శర్మగా రేమనుకున్నాడో!' అంటూ తర్కించుకుంది. 'ఎప్ప డెవరికే బుద్ధిపుడుతుందో అంటే, ఆయన భుజాలు తడుంకోలేదు కదా?' అంటూ రెట్టించుకుంది.

వరాలు మాటలకి శర్మ ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు. ఈవిడ అసలు ఎలాంటి మనిషి? శకుంతలకి ఎంత చీదరో ఈవిడ మాటలంటే! శకుంతల అన్నట్టు ఈవిడ మొగాళ్ళంటే వెర్రెత్తే మనిషిలాగే వుంది, ముట్టుకుంటే మురుస్తుందో కరుస్తుందోగానీ. శర్మ గుండెల్లో ఆశలు మొలకలెత్తాయి!

ఈ వాటాలోకి వచ్చిన కొత్తలోనే శకుంతల వరలక్ష్మి నైజం పసికట్టేసింది — "ఛీ! బొత్తిగా మంచీ మర్యాదా లేని మనిషి!" అని ఈసడించుకుంది, ఒకనాడు.

"ఎవరిమీదో ఆ కోపం?" అన్నాడు శర్మ, భార్య మాటలు వింటూ.

"ఇంకెవరు? ఉందిగా పొరిగింటి ఇల్లాలు."

"ఎవరూ? మూర్తిగారి భార్యా? వరలక్ష్మి అంటారూ....?"

శకుంతల మౌనం చూస్తే శర్మకి కుతూహలం కలిగింది — "ఏం, ఏమైంది? ఆవిడ ఎలాంటి దేమిటి?"

చురుగ్గా చూసింది శకుంతల—"ఇంకెలాంటిది? తమలాంటిదే."

నవ్వాడు శర్మ — "ఛ! ఆడవాళ్ళు నాలా వుండరుగా?"

"ఎందుకుండరూ? ఉండకపోతే మీలాంటి వాళ్ళకి ఆడవాళ్ళెలా దొరుకుతారూ?"

"అబ్బ, నీ కోపానికేంగానీ, అసలేం జరిగిందో చెప్పూ!" అన్నాడు. వినాలని చాలా కుతూహలం.

కానీ, అప్పటికేం చెప్పలేదు శకుంతల. శర్మ రెట్టించనూ లేదు. మళ్ళీ అడిగితే శకుంతలకి అనుమానం పుడుతుందని భయం.

తర్వాత తనంత తనే చెప్పింది — "పరాయి మగాడు కన్పిస్తే చాలు; పగలబడి నవ్వుతుంది. కంఠం పెద్దది చేసి చమత్కారంగా మాట్లాడుతుంది. తన మాటలూ నవ్వులూ మొగాళ్ళు వినాలన్నట్టు! ఏం మనిషనుకోవాలి?"

"నేనేమైనా సమర్థించానంటే, నా మీద విరుచుకు పడతావు" అంటూ నవ్వాడు శర్మ.

"ఆవిణ్ణి సమర్థించటం ఎందుకో?"

"అది కాదు శకుంతలా! గట్టిగా నవ్వితేనే, గట్టిగా మాట్లాడితేనే తప్పా? ప్రతీ దానికీ అపార్థం చేసుకోకూడదు. కొంతమందికి వయసు పెరుగుతోన్నా పసితనం పోదు. చిన్నపిల్లల్లాగే వుంటారు."

శకుంతల చురచురా చూసింది — "అబ్బా! ఎంత కష్టపడి వాదిస్తున్నారూ!" అంది.

శర్మ నవ్వాడు — "నీ కోపం నా మీదా?"

"కాకపోతే ఏమిటి? వెర్రిదానికి బోధించినట్టు బోధిస్తారేం? సాటి ఆడదాన్ని గురించి అన్యాయంగా మాట్లాడటానికి నేనేం బుద్ధి తక్కువ మనిషినా? జానకి గురించి ఏమైనా అంటున్నానా? ఆవిడ మర్యాద ఈవిడ కెక్కడివి? ఉన్నమాటన్నాను గానీ, వర్లక్ష్మి అంటే నాకేం పగా ఏమిటి?"

శర్మ మాట్లాడలేదు.

"మొన్న ఏమందో తెలుసా? మధ్యాన్నం పూట అంతా వరండాలో కూర్చున్నాం. మన పాప వరలక్ష్మిని ఎందుకో 'అత్తా!' అని పిలిచింది. ఆవిడ అదోలా నవ్వుతూ 'అత్త కాదమ్మా పాపా! పిన్నీ అని పిలు. నాకలాగే బాగుంటుంది, ఏం, ఎలా పిలుస్తావో వింటాను. ఒక్కసారి పిన్నీ అను' అంటూ పసిదాన్ని బుజ్జగించి 'పిన్నీ, పిన్నీ!' అనిపించుకుంది. నాకు ఒళ్ళు మండిపోయింది. అత్త వొద్దట! పిన్నీ అనాలట! అప్పట్నుంచీ పాప వర్లక్ష్మిని 'పిన్నీ' అనే పిలుస్తోంది.

శర్మకి నవ్వొచ్చింది — "మంచి గొడవే నీతో" అన్నాడు.

"పిలుపుల్లో ఏముంది అనా ఏమిటి మీ నవ్వూ మీరూనూ. పిన్ని పిన్నిలాగా వూరుకుంటే బాగానే వుంటుంది. 'బావగారు భోంచేశారా అక్కా? బావగారు నిద్రపోతున్నారా అక్కా' అంటూ అస్తమానూ 'బావగారి' యోగక్షేమాలు ఆరా తీస్తూ వుంటుంది. ఆవిడ, బావగారన్నప్పుడల్లా నాకు ఒళ్ళు మండుతూ వుంటుంది. అంటీ అంటనట్టు జవాబులు చెప్తాను. అయినా గ్రహించదు. ఈవిడికెందుకటా బావగారి సంగతులూ? పరాయి మగాళ్ళతో అన్నా చెల్లెళ్ళ వరసలు పెట్టుకుంటారా, బావా మరదళ్ళ వరసలు పెట్టుకుంటారా? బుద్ధిలేని మనిషి!"

"మీ ముగ్గురూ బాగానే మాట్లాడుకుంటూ వుంటా

రుగా? ఆవిడతో అంత స్నేహంగా ఎలా వుంటావూ?"

"స్నేహంగా వుండకపోతే తగూలు పెట్టుకుంటామా? అన్ని విషయాలకీ మనిషి మంచిదే. మొన్న పాపకి జ్వరం వస్తే దగ్గిర కూర్చుని ఎంత చాకిరీ చేసిందో? ఇరుగూ పొరుగూ అన్నాక మాట మంచితనం లేకండా ఎలా బతగ్గలం? మీరన్నట్టు నేనే అపార్థం చేసుకుంటున్నానేమో అనిపిస్తుంది అప్పుడప్పుడూ."

"ఆ మాటేగా నేనంటే విరుచుకు పడ్డావు."

శర్మతో పాటు శకుంతల కూడా నవ్వేసింది.

ఆ రోజునుంచీ శర్మ వరలక్ష్మి తారసపడ్డప్పుడల్లా పరికించి చూస్తూనే వున్నాడు. శకుంతల అన్నంత తప్పుడు మనిషిలా తోచలేదావిడ. చూసీచూడగానే తల ఒంచేసుకుంటుంది పాపం! 'వేరే ఆలోచన వున్న వాళ్ళు అలా చేస్తారా? శకుంతలకి మరీ భయం! ఏ ఆడది తన మొగుణ్ణి వల్లో వేసుకుంటుందో అని! అందుకే వరలక్ష్మి నవ్వులకు బెదిరిపోతుంది' అనుకున్నాడు శర్మ.

శకుంతల పురిటికి పుట్టింటికి ప్రయాణం పెట్టుకున్న దగ్గర్నించీ అప్పుడప్పుడూ తన భయాలు బయట పెడుతూనే వుంది మాటల్లో — "ఏమిటో ఈ సారి మిమ్మల్ని విడిచివెళ్ళటం అంటే బెంగగా వుంది నాకు" అంది.

"ఎందుకూ? బెంగెందుకూ?" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

"ఏమో! ఇక మనం కలవలేకపోతే?"

"చాల్లే! అవేం మాటలు?"

"ఏం? అలా జరక్కూడదా?"

"నీ మనసులో ఏముందో చెప్పరాదూ?"

అలా అడిగితే శకుంతల మాట్లాడదు. తన మనస్సులో ఏముందో గ్రహించగలిగే మనిషికి ఇంకా ఏం చెప్తుంది? తన భయం ఆయనకీ తెలుసు.

శర్మ, భార్య భుజాలచుట్టూ చేతులువేసి, అనునయించాడు — "ధైర్యంగా వుండు శకూ! పిచ్చిపిచ్చి భయాలు పెట్టుకోకు. నీ కానుపు తేలికే కదా? నీ ఆరోగ్యం కూడా మంచిది. మూడో నెల తిరిగి వచ్చేసరికి ఎప్పటిలా నిక్షేపంగా ఇలాగే వుంటాం. నువ్వే బెంగపెట్టుకుంటే నా మాటేమిటి? ఒంటరిగా ఈ మూడు నెలలూ నేనెంత బాధగా గడపాలో ఆలోచించు! నువ్వు తిరిగి వచ్చేదాకా క్షణాలు లెక్కపెట్టుకుంటూ గడుపుతాను. అదిగో .... ఎందుకలా నిర్లక్ష్యంగా చూస్తావు? నేనేం చెప్పినా నమ్మవు."

"ఛ, లేదు! ఎందుకు నమ్మను? మిమ్మల్ని కాకపోతే ఇంకెవర్ని నమ్ముతాను?"

"ఆ మాత్రం ధైర్యంతో వుండు, చాలు!"

శకుంతల కళ్ళలో సంతృప్తి కన్పించింది శర్మకి.

శకుంతల మనసులో ఏముందో, ఎందుకు భయపడుతోందో, శర్మ ఊహించలేని విషయం కాదు. కానీ, 'శకుంతలకి అన్నీ అనుమానాలే' అని తనని తను సమర్థించుకున్నాడు కొన్నాళ్ళ వరకూ.

శకుంతల వెళ్ళిపోయిన తర్వాత వరలక్ష్మి వీధి వరండాలోగానీ, పెరటి దొడ్లోగానీ ఎక్కడ తటస్థపడ్డా పూర్వంలాగ గిరుక్కున తిరిగిపోకుండా రెండడుగులు వెనక్కి వేసి నిలబడి— "అక్కయ్య దగ్గిర్నుంచి ఏమైనా ఉత్తరాలు వస్తున్నాయాండీ? పాప ఏం చేస్తోందటా? తమ్ముడే కావాలని కబుర్లు చెప్పేది" అంటూ తనంత తను పలకరించటం ప్రారంభించింది.

మొదట్లో శర్మ కాస్త కంగారుపడి తల ఎత్తకుండానే జవాబులు చెప్పాడు. ఇంట్లో శకుంతల లేని చికాకుతో ఎక్కడెక్కడో తిరిగి వేళాపాళా లేకండా ఇంటికి వస్తున్నాడు. తలుపులు తీసేసరికి ఈవిడ తయారై లేసు రుమాళ్ళు కప్పిన గిన్నెలు మేజా మీద పెట్టి ఏవేవో అడుగుతుంది.

శర్మ నొచ్చుకుంటూ రెండు మూడు సార్లు మూర్తితో అన్నాడు — "నా గురించి మీరు లేనిపోని శ్రమ తీసుకుంటున్నారు. నేను హోటల్లో శుభ్రంగా తిని వస్తున్నాను."

మూర్తి జవాబుగా నవ్వి వూరుకుంటాడు. కానీ వరలక్ష్మి నవ్వుతూ అంటుంది — "మీ కోసం శ్రమేముందండీ? మాతోపాటే మీకూనూ. అక్కయ్య వస్తే ఎవరి అవసరమూ వుండదు. అంతా ఆవిడే చూసుకుంటుంది."

ఏవిటా మాటలు? తను హోటల్లో తిని వస్తాడు. మళ్ళీ ఈ గిన్నెలతో కూరలెందుకు? చెప్తొంటే వినదేం?

ఆ రోజు వరకూ వరలక్ష్మికి దూరదూరంగానే వుంటున్నాడు శర్మ. సాయంత్రం నూతి దగ్గర వరలక్ష్మి నవ్వులూ కబుర్లూ వినేవరకూ మూర్తి వూళ్ళోలేడనే సంగతి తెలీనే తెలీదు శర్మకి. కిటికీలోంచి తను చూస్తు న్నట్లు తెలిసినా వరలక్ష్మి అంత బట్టవిప్పుకున్నట్టు మాట్లాడ్డం, పగలబడి నవ్వటం, వారవారగా చూడ్డం .... అదంతా 'ఆహ్వానం'లాగే తోచింది శర్మకి.

చీకటి పడేవరకూ తెగ ఆలోచించి బుర్ర వేడె క్కించుకున్న శర్మ, ఇంటికి తాళంవేసి వీధిలోకి బయ ల్దేరాడు.

★ ★ ★

పొయ్యి ఆర్పేసి ఆలోచిస్తూ నిద్రలోకి జారి పోయిన వరలక్ష్మి, ఒక్కసారిగా వాతావరణం మారి పోయేసరికి ఉలిక్కిపడుతూ లేచింది. ఆకాశమంతా చిమ్మచీకటి అలుముకుంది. చుట్టుముట్టిన మబ్బు లతో నక్షత్రాల కాంతి మరుగున పడిపోయింది. సన్న సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి చూస్తున్నంత లోనే వర్షంలోకి దిగింది.

వరలక్ష్మి మనసంతా ఆవేదనగా వుంది.

వర్షపు ధారలకేసి చూస్తోంటే చిత్రమైన ఆవేశం పొంగివచ్చింది. చటుక్కున లేచింది. చన్నీళ్ళతో స్నానం చేసి, ఉతికి ఆరవేసుకున్న పువ్వుల చీర అలమారులో పడేసి బీరువాలోంచి తెల్ల ఇస్త్రీ చీర తీసి కట్టుకుంది. అద్దం దువ్వెనా తెచ్చుకుని టేబుల్ ముందు కూర్చుంది — వదులుగా చెవులమీదికి జుట్టుపడేలా జడ అల్లుకుంది. నచ్చినట్టు లేకపోతే జడవిప్పి చక్రంలా ముడి చుట్టింది. పువ్వులు లేని కొరతతో వరలక్ష్మి మొహం చిన్నబోయింది. అంతలోనే ఉత్సా హంగా లేచి, తడి టవల్‌తో మొహం ఒత్తుకుని, స్నో రాసి, పౌడర్ అద్దుకుంది. కనురెప్పల నిండుగా కాటుక రేఖలు తీర్చుకుంది. కూనిరాగం తీస్తూ పరాకుగా సెంటు సీసా చీరనిండా ఒంపుకుంది. వాతావరణం ఒక్కసారి మొగలి సువాసనలతో గుభాళించింది.

చలాకీగా లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడింది. వర్షం కుండపోతగా పడుతోంది. వర్షపుధారల చప్పుడు తప్పితే ఏమీ వినరావటం లేదు. శర్మ ఇంట్లోంచి ఏమైనా చప్పుళ్ళు వినపడతాయా అని చెవులు రిక్కించింది. ... అసలు శర్మ ఇంట్లో వున్నాడా?.... ఏ చప్పుడూ లేదు.

వరలక్ష్మి ఉత్సాహమంతా చచ్చిపోయినట్టయింది. నెమ్మదిగా వచ్చి మంచం మీద కూర్చుంది. అప్రయ త్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి — పిచ్చిగాని ఎన్ని రాత్రిళ్ళు తనిలా అనుభవ రహితంగా గడపలేదు! ఎంత యౌవ్వన భాగ్యాన్ని వృధా చేసుకోలేదు! — నిస్పృహగా నిట్టూర్చింది.

ఇంకెన్ని రాత్రుళ్ళు — ఎన్ని నెలలు — ఎన్ని సంవత్సరాలు — ఇలా నిష్కామమైన మూగ బతుకు బతకాలి? తనమీద తనకే జాలి! తన మీద తనకే అభిమానం! తన అదృష్ట రేఖ ఎందుకింత కుంచిం చుకు పోయింది? దుఖ్ఖావేశంతో దిండు మీదికి ఒరిగిపోయింది వరలక్ష్మి.

ఒకటి కాదు, రెండు కాదు, ఎనిమిదేళ్ళ దాంపత్య జీవితంలో వరలక్ష్మి అనుభూతులన్నీ నిస్సారమైనవే. తల్చుకున్నంత మాత్రాన గుండెలు ఝల్లుమనిపించే .... కన్నులు అరమోడ్పులయ్యే .... సిగ్గు తెరలు ముంచుకు వచ్చే మధుర స్మృతులేమీ లేవు.

"మీ ఆయన తెలుగు పండితుడట కదా? మంచి శృంగార పురుషుడై వుంటాడులే" అని పెళ్ళి చూపుల నాడు చమత్కరించిన స్నేహితురాలి మాటలు అస్తస్త మానూ గుర్తు వస్తూనే వుంటాయి వరలక్ష్మికి. నిజానికి శృంగారమంటే ఏమిటో అప్పట్లో వరలక్ష్మికి తెలీదు. పదిహేడో ఏట పెళ్ళయిన వరలక్ష్మి భర్తనుంచి ఏమీ తెలుసుకోకుండా అమాయకపు స్థితిలోనే గడిపేసింది రెండు మూడేళ్ళు.

రామ్మూర్తి వయస్సు మళ్ళినవాడు కాడు. రోగిష్టి వాడూ కాడు. ఎర్రగా, సన్నగా, మెత్తటి తలకట్టుతో, నాజూకైన చెంపలతో కోమలంగా వుంటాడు. ఆవేశం ..... ఉద్రేకం ..... తొందరపాటు ఏమీ అతని అనుభవా నికి రావు. పదిమందీ మాట్లాడుకునే పరిభాషతో చెప్పుకుంటే, వరలక్ష్మి వాళ్ళాయన 'సత్తెకాలపు మనిషి.' పెళ్ళయిన కొత్తల్లో, వరలక్ష్మి వాంఛలు ఉధృతంగా రేకెత్తని రోజుల్లో, కాలం ఎలా గడిచిపోయిందోగానీ,

క్రమంగా వరలక్ష్మిలో స్త్రీత్వం రెక్కలు విప్పుకుంది. రామ్మూర్తి మనస్తత్వం కొంతవరకూ అర్థం చేసుకోగలిగిన వరలక్ష్మి భర్త గురించి సానుభూతితోనే ఆలోచించేది. భర్త మీద వున్న అనురాగంతో అతనిలో ఉత్సాహం కలిగించడానికే ప్రయత్నించేది.

వరలక్ష్మికి ఒక్కో సంఘటనా గుర్తొస్తున్నాయి.

ఒకనాడు, అర్ధరాత్రివరకూ మేఘసందేశం పఠిస్తోన్న భర్తని వారిస్తూ. చిలిపిగా దీపం తగ్గించేసింది వరలక్ష్మి. "ఏమిటో అంతశ్రద్ధగా చదవటం? ఈ పాటికి చాలా శృంగారం ఒంటబట్టి వుంటుంది" అని నవ్వింది.

"అబ్బ! ఉండు లక్ష్మీ! అర్థాలు రాసుకోవాలి. రేపు పిల్లలకు కొన్ని పద్యాలు చెప్పాలి" రామ్మూర్తి తిరిగి దీపం పెద్దది చేసి పెన్ను తీసుకుని కూర్చున్నాడు.

వరలక్ష్మి చిలిపిగా పెన్ను లాక్కుంది.

"కాస్సేపు కబుర్లు చెప్పుకుందాం. తర్వాత రాసుకోండి."

"మళ్ళీ తర్వాత నిద్రొచ్చేస్తుంది. నువ్వు పడుకో. నేను తొందరగా పూర్తి చేసి వస్తాలే."

"బడిపిల్లలకు పాఠాలు చెప్పడానికేగానీ, ఆ పుస్తకంలో మీ జీవితానికి నేర్చుకోవలసిందేమీ లేదా?"

"జీవితానికా? ఇందులో ఏం వుంది?"

"సరే, తొందరగా రాసుకుని రండి."

రామ్మూర్తి లేచేసరికి వరలక్ష్మి నిద్రపోయింది.

★ ★ ★

వరలక్ష్మికి పువ్వులంటే తగని పిచ్చి. అందులోనూ మల్లెపువ్వులంటే మహా ఇష్టం. భర్త బజారుకి బయల్దేరే ముందు హెచ్చరించినా మూర్తి పువ్వుల మాట మర్చి పోతూనే వుంటాడు. ఆ రోజు వరలక్ష్మి కొత్త చీర కట్టుకుంది. కొత్తరకం ముడి చుట్టుకుంది. భర్త తేనున్న పువ్వుల పొట్లంకోసం గంపెడాశతో ఎదురు చూస్తూ నించుంది. భయపడ్డంతా అయింది. "పువ్వులు తెచ్చారా?" అని ఆతృతగా అడిగితే "పువ్వులా? అరె! మర్చిపోయాను లక్ష్మీ!" అన్నాడు. అప్పటికి ఎన్నిసార్లో అలాంటి నిరుత్సాహాలు!

కొత్త రోజుల్లో అయితే "అబ్బా, పూలు కొనాలంటే నాకు సిగ్గు. నువ్వు వెళ్ళి తెచ్చుకో" అనేవాడు. లేకపోతే, "పూలు ఎంచటం నాకు సరిగా తెలీదు" అనేవాడు.

"మీరు ఎంచేదేమిటి? కొట్టు మనిషే ఇస్తాడు" అంటే, "మొగాళ్ళు పువ్వులు కొనబోతే దగా చేస్తారు. వీధిలోకి వచ్చినప్పుడు నువ్వు బేరంచేసి తీసుకో వచ్చుగా?" అన్నాడు.

"అణా పువ్వులకి బేరాలా?"

"ఏం, అణా వుత్తినే వస్తుందా? నీకు డబ్బు విలువ తెలీదు."

వరలక్ష్మి ఈసడింపుగా అంది. "నాకు డబ్బు విలువ తెలియకపోతే నష్టం లేదు. మీకు మనిషి విలువే తెలీదు. బతుకు విలువే తెలీదు." కళ్ళనిండా నీళ్ళు నిండి విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటికైనా మూర్తి మళ్ళీ బయల్దేరి వెళ్ళి. ఆ పువ్వులేవో తీసుకురాకూడదూ? ఆ మర్నాడూ అంతే. ఆ మాటే గుర్తు వుండదు. తల్లో మల్లెపూలు పెట్టుకుని భార్య వచ్చి పక్కలో పడుకుంటే, ఆ పరిమళానికి భర్తకి కూడా సంతోషం కాదూ?

కానీ, ఈ భర్తకి సంతోషం కాదు.

"పూలు తల్లో ఎందుకూ? నలిగిపోతాయి. తీసి పందిరి మీద మంచులో పెట్టు. రేపొద్దున్న పెట్టుకోవచ్చు" అన్నాడు ఒకటి రెండుసార్లు.

"పూలజన్మ మన మధ్య నలిగిపోడానికే" అని నవ్వేది వరలక్ష్మి.

పూలు నలిగేంతగా ఆ భర్త ఆ భార్యని ఎప్పుడూ కావిలించుకోడు. అసలు ఎంతోసేపు పక్కన పడుకోడు.

పెళ్ళయిన కొత్తలో మూడు నెల్లో, ఆరు నెల్లో ఒక మంచం మీద పడుకున్నారేమో! అప్పటినించీ అతను వేరే మంచమే. వరలక్ష్మే వెళ్ళి అక్కడ పడుకుంటే, "అబ్బా! నాకు నిద్రపట్టదు. నువ్వు నీ మంచం మీదకి వెళ్దూ" అంటాడు.

"మీకు దూరంగా వుంటే నాకసలే నిద్రపట్టదు" అనేది వరలక్ష్మి.

"దూరం ఏమిటి? ఇక్కడే వున్నాంగా?"

"దగ్గిరిగా ఉండడం అంటే, ఒక గదిలో ఉండడం కాదు. ఒక మంచం మీద వుండాలి. ఇద్దరూ చెరో పట్టి మీదా పడుకోడం కాదు" అని నవ్వేది వరలక్ష్మి.

"ఇప్పటి దాకా పడుకున్నాంగా?" అంటాడు.

"ఏవిటీ, అర గంటా?"

కొంచెం నవ్వుతాడు "అబ్బా, వెళ్లు! నాకు నిద్రొస్తోంది."

"నిద్రొస్తే నిద్రపోండీ, నేనేం వొద్దన్నానా?"

"అబ్బా, చెప్తే వినవు" అంటూ తనే లేచిపోతాడు. వరండాలో మడతమంచం వాల్చుకుని పడుకుంటాడు. రెండు నిమిషాల్లో నిద్రపోతాడు.

అతనూ తనూ తెల్లవార్లూ ఒక్క మంచం మీదే పడుకోవాలి — అని వరలక్ష్మికి పెద్ద కోరిక. అంతే కాదు. అతను, పట్టివేపు తిరిగి పట్టిని కావిలించుకోడం కాదు, తనని కావిలించుకుని పడుకోవాలి. తన చెంపమీద ముద్దులు పెట్టుకుంటూ, చిలిపిగా మాట్లాడుతూ పడుకోవాలి!

ఆ భర్త ఒక్కనాడు కూడా భార్యకి అలాంటి సంతోషం కలిగించడు. మొగ జంతువు ఆడ జంతువుతో కలిసినట్టే కలుస్తాడు. విడిపోతాడు. వేరే మంచం మీదకిపోతాడు. మళ్ళీ ఎప్పటికో ఆ జంతు కలాపం!

మొదట్లో వరలక్ష్మి అతని వెంటపడి, అతని మంచం మీదకి పోయి అతన్ని విసిగించేది.

రానురానూ ఆ చేష్టలన్నీ మానుకుంది. అతను వెళ్ళిపోగానే అవమానపడిపోతూ, కళ్ళనిండా నీళ్ళతో అతని వేపు చూడకుండా ఇటుతిరిగి పడుకోడం నేర్చుకుంది.

ఎంత నేర్చుకున్నా అది ఇంకా వంటబట్టలేదు. అలవాటు కాలేదు.

వరలక్ష్మికి తీరని కోరికలు చాలా ఉన్నాయి. భోజనాలయ్యాక తమలపాకులు నమిలే అలవాటు లేదు మూర్తికి. "అవన్నీ మంచిది కాదు. పళ్ళు గారపడతాయి" అంటాడు.

ఆ మాటా నిజమే. కానీ, వరలక్ష్మికి అదంతా విడ్డూరంలాగ అనిపిస్తుంది. "నిజమేగానీ....." అని తటపటాయిస్తుంది. తను తమలపాకుల్లో సుగంధాలన్నీ వేసి చుట్టి ఆయన నోటికి అందించాలి. ఆయన దాన్ని కొరుకుతూ దానితోపాటు తన వేలు కూడా కొరకాలి. "ఛీ, పోండీ!" అనాలి తను. కానీ, అతను అలా చెయ్యడు. తమలపాకులు చుట్టి నోటికి అందిస్తే, తన చేత్తోనే తీసుకుంటాడు.

"అన్నీ మీకేనా? నాకు కొంచెం ఇవ్వండి...."

"అయ్యో! కొరికేశానే!"

"ఫర్వాలేదు. అదే ఇవ్వండి."

"ఛా! ఎందుకూ, నువ్వు మళ్ళీ చుట్టుకో, ఆకులున్నాయిగా?"

"అబ్బా నేనిప్పుడు చుట్టుకోలేను బాబూ! చిన్న ముక్క ఇద్దురూ! అంతా మీరే తినెయ్యాలా మేకలాగ?"

"నువ్వే తినకపోయావా, నాకెందుకిచ్చావు? నాకసలు అక్కరే లేదుగా?"

వరలక్ష్మి నవ్వ, "పరిమళంగా వుండే నోటితో దగ్గిరిగా మాట్లాడుకోడం ఎంత బాగుంటుంది! ఆ నోటితో ముద్దులు పెట్టుకుంటే మరీ బాగుంటుంది" అనేది, అతని చెంపమీద కొట్టి.

"ఆఁ, బాగుంటుంది. పళ్ళు గారబడితే ఇంకా బాగుంటుంది" అంటాడు.

"పోనీ, తమలపాకులు మానేద్దాం లెండి. యాలుక్కాయలు నోట్లో పెట్టుకుంటే ఎంత పరిమళంగా వుంటుందో!"

"సరేలే, నువ్వు తిను, నా కొద్దుగానీ."

"అబ్బా, యాలుక్కాయలు కడుపునిండా తింటామా యేంటి? నేను తినాలా? మీకు అక్కర్లేదా? అయితే, మీ నోటితో నా పక్కన మాట్లాడకండి" అనేది కోపంగా.

"నేను వేరే పడుకుంటానంటే వినవుగా?"

అలా ముగుస్తుంది తాంబూల సేవనం!

చిన్నబోయి, కళ్ళుచెమర్చి గోడవేపు పట్టిమీద మొహం పెట్టుకుని పడుకుంటే వరలక్ష్మికి ఎంతకీ నిద్ర రాదు. ఎప్పుడెప్పటి సంగతిలో గుర్తొస్తాయి.

వరలక్ష్మి వరాలుగా, పది పన్నెండేళ్ళ పిల్లగా వున్నప్పుడు, వాళ్ళ మేనత్తతోటి ఒకసారి పేరంటానికి వెళ్ళింది. పేరంటాలకు వెళ్ళటం కొత్త గాకపోయినా, అక్కడ జరిగిన విశేషం తలచుకున్నప్పుడల్లా వరలక్ష్మికి

నవ్వు వస్తుంది.

"వరాలూ! ఒక మంగళహారతి పాడవే! నీకు బాగా పాటలు వచ్చుటకదా?" అందో పేరంటాలు.

వరాలు ఎక్కువ బతిమాలించుకోకుండానే పాట ప్రారంభించింది. "ఆడ బ్రతుకే మధురం! పతి కౌగిటిలో పరవశమయ్యే భార్య బ్రతుకే మధురం! ఆఁ, ఆఁ, ఆడ బ్రతుకే..." అంటూ.

ఫక్కుమన్నారు అందరూ ఒక్కసారే. బిత్తర పోయింది వరాలు. పాడటం మానేసి తెల్లబోతూ చూసింది.

"నీ అమ్మకడుపు బంగారంగానూ! ఇదేం పాటే! మంగళహారతి పాడమంటే ఆడబతుకంటూ మొద లెట్టావ్" అన్నారు.

"పతి కౌగిలి కావాలట దీనికి!" అంటూ అందరూ విరగబడి నవ్వారు.

వరాలు బిక్కమొహంతో "మా అత్త.... అస్తమానూ ఆ పాటే పాడుకుంటుంది! అందుకే నేనూ పాడానూ" అంది.

కాస్సేపు అందరూ కలిసి వరాలు మేనత్తని హాస్యాలు పట్టించారు.

వరాలు అత్త సీతారత్నం చాలా అందమైంది. చురుకైంది. ఆవిడ భర్త కూడా ఆమెకు తగినవాడే. వాళ్ళిద్దరి దాంపత్యం చూసేవాళ్ళకి ముచ్చటో అసూయో ఏదో ఒకటి కలిగించే రకంగా వుంటుంది ఇప్పటికీ! వరాలు చిన్నతనంలో ఎక్కువగా మేనత్త గారింట్లోనే ఉండేది.

సీతారత్నం వాళ్ళ పడగ్గది చాలా అలంకారాలతో వుంటుంది. నగిషీలు చెక్కిన పందిరి మంచానికి గులాబీ పువ్వుల పందిరీ — తెల్లటిసిల్కు దోమతెరా — దాని చుట్టూ రిబ్బన్నుల కుచ్చులూ — మంచానికి రెండు వేపులా పెద్దపెద్ద అద్దాలూ — పందిరికి వేళ్ళా డుతూ రంగురంగుల పాదరసం గాజుబుడ్లూ బూరుగుదూది పరుపూ — రంగుదారాల్తో పువ్వులు కుట్టిన తలగడదిళ్ళూ — తెల్లటి మెత్తటి దుప్పట్లూ... 'అబ్బో! పడుకుని నిద్రపోయే మంచానికి ఎందుకి వన్నీనూ!' అనుకునేది వరాలు చిన్నప్పుడు.

మంచంమాట అలా వుంచి, మిగతా గది మాత్రం ఎంత అందంగా వుంటుందనీ! గది నిండుగా నేల కన్పించకుండా తీగలు పాకుతోన్న తివాచీ — మంచం దగ్గర మేజామీద చన్నీళ్ళతో మట్టికూజా — గాజు గ్లాసూ!

"అత్తా! ఒక గ్లాసే పెట్టుకుంటావేం? మరి నువ్వు మంచినీళ్ళు తాగవూ?" — కడుపులో మాటకాస్తా అడిగేసిందోసారి వరాలు.

సీతారత్నం నవ్వింది — "ఏం, ఒక్క గ్లాసు చాల దేమిటే?"

"ఛీ! మామయ్య తాగిన ఎంగిలి గ్లాసుతో నువ్వు తాగుతావా?" మొహం చిట్లించింది వరాలు.

సీతారత్నం మేనగోడలి బుగ్గ గిల్లింది హాస్యంగా "లేదే, నేను తాగిన ఎంగిలి నీళ్ళే మామయ్య కిస్తాను."

వరాలు మొదట తెల్లబోయి తర్వాత జాలిగా చూసింది. పాపం మామయ్య కూడా అలా తాగుతా డంటే...., ఎందుకో నచ్చలేదు వరాలికి.

అత్త గదిలో కూర్చున్నంత సేపూ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అంగుళం అంగుళం చూస్తూనే ఉండేది వరాలు.

అద్దాల బీరువాకి పక్కగా ఇంకో మేజామీద పూలు పెట్టుకునే గాజుకూజా, అగరొత్తుల చెట్టూ, పన్నీరుబుడ్డీ! సీతారత్నం రోజూ సాయంత్రాల వేళ పెరట్లో పూసే పువ్వులు తెచ్చి కూజాలో సర్దుతుంది. కిటికీ తలుపులు మూసి అగరొత్తులు వెలిగిస్తుంది. పన్నీరు బుడ్డీలో రెండు చుక్కలు సెంటు వేసి వుంచు తుంది. తను ఇంటి పనులు ముగించుకుని స్నానం చేసి ముస్తాబు కుపక్రమిస్తుంది.

గది గోడలనిండా కళ్ళు సగం మూసి ఒళ్ళు విరుచుకొంటోన్న, బట్టలు వుండీలేని బొమ్మలు చూస్తే వరాలుకి అంత చిన్నప్పుడు కూడా సిగ్గేసేది — "అత్తా! ఈ బొమ్మ లేం బాగున్నాయి? బట్టలే సరిగా లేవు. చక్కగా రాముల వారి బొమ్మా, బుద్ధుడి బొమ్మా, పార్వతీదేవి బొమ్మా ..... అలాంటివి పెట్టుకుంటే బాగుంటుంది. గాంధీతాత బొమ్మలు పెట్టుకున్నా బాగుంటాయి. అల్లాంటి బొమ్మలు తెమ్మని మామ య్యకి చెప్పత్తా!"

అత్త ఎంతసేపు నవ్విందో! అంతలోనే మామయ్య

వస్తే ఏమిటో చెప్పింది. పెద్ద కంఠంతో నవ్వాడు. ఇద్దరూ నవ్వుతోంటే వరాలు తూనీగలాగ పరిగెత్తింది వీధిలోకి.

ఆ చిన్నతనం గుర్తొస్తే వరలక్ష్మికేదో అర్థంకాని ఆవేదన కలుగుతుంది. అత్తచేసే పనుల్లో ఇప్పుడు ఎన్నో అర్థాలు కన్పిస్తాయి. పెళ్ళయిన కొత్తలో అత్తలాగే తనుకూడా పడగ్గదిని ఎంతో అందంగా అలంకరించు కోవాలనుకునేది. ఒకసారి భర్త దగ్గిర మేనత్త ఇంటిని వర్ణించింది. తన చిన్నతనాన్ని ముచ్చటించింది. మన సులో వున్న కుతూహలాన్ని కూడా ధ్వనింపజేసింది. చిట్టచివరికి నవ్వుతూ అంది — "మా అత్తయ్య ఇప్పటికైనా తన ముస్తాబులోనూ, ఇంటి ముస్తాబు లోనూ అశ్రద్ధ చెయ్యదు. చిన్నప్పుడు అన్ని విషయాలు అడిగేదాన్ని కానీ ఇప్పుడు ఏమైనా మాట్లాడాలంటే చచ్చేంత సిగ్గుగా వుంటుంది. మొన్న అత్తయ్య మనింటికి వచ్చినప్పుడు ఏమందో చెప్పనా? బయటికి వెళ్ళే మగాళ్ళని వెనకనించి ఇల్లూ ఇల్లాలూ అయ స్కాంతాల్లా ఆకర్షిస్తూ వుండాలట. 'ఏమే వరాలూ! బొత్తిగా ఇలా చెట్టు కింద సామాను పరుచుకున్నట్టు సర్దుకున్నావేమే? పడగ్గది అంటూ దీనికేమైనా అందం చందం వున్నాయా? అని మందలించింది. నిజమే ననిపించింది నాకూనూ" — భర్త మొహంలో ఏం కనపడుతుందా అని వెతికింది. ఏవో కనపడ్డాయిగానీ, అదంతా పట్టనితనం.

"వాళ్ళకీ మనకీ పోలికేమిటి లక్ష్మీ? పల్లెటూళ్ళల్లో స్వంత ఇళ్ళు కాబట్టి పడగ్గది అంటూ ఒకటి వుంచు కుంటారు. మనకి అన్ని గదులూ ఇదే! అంత చాటుగా ఉంచుకోవాలంటే ఎలా వీలౌతుంది?" అన్నాడు రామ్మూర్తి, బొత్తిగా ఉత్సాహం లేకండా.

మూర్తి "అన్ని గదులూ ఇదే" అన్నాడు కానీ, వంటగది వేరే వుంది. ముందు వరండా వేరే వుంది.

"ఉన్నంతలోనే తయారు చేసుకుందాం. మన మంచానికి పందిరి పెట్టించుకుదామా? దానికి పూలు కుడతాను."

"చాల్లే! ఈ రోజుల్లో పందిరి మంచం ఏమిటి? పైన ఫాను తిరిగినా గాలీరాదు, పాడూరాదు."

వరలక్ష్మి కొంచెం నవ్వింది. నిజమే అనిపించింది. పందిరి పెట్టించాలంటే బోలెడు పని! బోలెడు ఖర్చు! అసలు ఒక్కచోట పడుకోని వాళ్ళకి పందిరి మంచం ఎందుకూ? నెత్తినేసి కొట్టుకోడానికా?

కానీ, పందిరి మంచం వుంటే జీవితం మారి పోతుందని వరలక్ష్మికి ఏదో నమ్మకం.

వారం రోజులదాకా నిరుత్సాహంగానే తిరిగింది. అప్పటికి తేరుకుని తనని తను ఉత్సాహపర్చుకుంది.

చిరుగుపట్టిన సిల్కుచీర ఒకటి చించి చేతికుట్టు తోనే కిటికీకీ, రెండు గుమ్మాలకూ తెరలు కుట్టింది. పాత పుస్తకాల పెట్టెలో ప్రకృతి దృశ్యాలతో నిండిన కేలండర్లేవో వుంటే, వాటిల్లోనించి పువ్వులూ పిట్టలూ వున్న బొమ్మలు చింపి రెండు గుమ్మాలకూ ఎదరగా అంటించింది. గది దులిపి కడిగి ముగ్గులుపెట్టి సాంబ్రాణీ పొగ వేసింది. మంచం మీద తెల్లదుప్పటి పరిచింది.

మామూలుగా గదిలోకి వచ్చిన రామ్మూర్తి పడక కుర్చీ యథాస్థానంలో లేకపోతే దృష్టి నాలుగువేపులా తిప్పాడు — "అరే! .... కర్టెన్లెక్కడివి లక్ష్మీ? నువ్వేనా ఇదంతా చేశావు?" అన్నాడు.

"నేను కాకపోతే ఎవరు చేస్తారు?" అని ముసి ముసిగా నవ్వింది వరలక్ష్మి. భోజనాలయ్యాక "రేపో సెంటుసీసా, అగరొత్తులకట్టా తీసుకురండి" అంది. అతను తేకపోతే తనే వెళ్ళి కొనాలనుకుంది.

మర్నాడు మళ్ళీ చెప్పింది.

రామ్మూర్తి గట్టిగా జ్ఞాపకం పెట్టుకుని ఆ రెండూ తెచ్చాడు.

వరలక్ష్మి రాత్రి స్నానం తర్వాత సెంటుసీసా మూతతీసి తన చీరకి కాస్త రాసుకుని మొగుడి బట్టలకి కూడా కాస్త పట్టించింది నవ్వుతూ.

"ఇలా ఒంపుకుంటే అదెన్నాళ్ళు వస్తుంది? అప్పుడప్పుడూ నువ్వొక్కదానివీ రాసుకొంటూ వుండు. ఏ పేరంటానికన్నా వెళ్ళేటప్పుడు రాసుకోవాలిగానీ...." అన్నాడు.

అతని మాటలు పట్టించుకోకుండా అగరొత్తులు వెలిగించటంలో నిమగ్నమైంది.

ఇంటి అలంకరణ విషయంలో భర్తకి ఆసక్తి లేకపోయినా వరలక్ష్మి ప్రయత్నిస్తూనే వుంటుంది.

ఇంట్లో జాగ్రత్త చేసిన చిల్లరా మల్లరా పెట్టి ఏవేవో కొంటూనే వుంది.

"తలగడ గలీబులమీదా, దుప్పట్ల మీదా చిన్న చిన్న పువ్వులవీ కుడతాను, రంగుదారాలు తెచ్చుకుంటే బాగుండును" అంది ఒకసారి.

రామ్మూర్తి విసుగ్గా చూశాడు — "ఎందుకొచ్చిన ఖర్చులు అవన్నీ? కడుపునిండాలా కాలు, నిండాలా?"

వరలక్ష్మి తెమ్మనే సరకులన్నీ ఉత్త అనవసరం అని అతని అభిప్రాయం. కానీ, అవి జీవితాన్ని మార్చేస్తాయని వరలక్ష్మి అభిప్రాయం. బొత్తిగా కాదంటే వరలక్ష్మికి కోపం వస్తుందని రెండు మూడు నెలల వరకూ సెంటుసీసాలూ అగరొత్తుల కట్టలూ తెచ్చాడు. "తిండి ఖర్చుకన్నా ఈ ఖర్చే ఎక్కువౌతోంది" అని వరలక్ష్మి వినేలాగే నాలుగైదుసార్లు అన్నాడు.

వినీవినీ వర్లక్ష్మికి విసుగేసింది — "తిండిలాగ ఇవీ అవసరమే. అందం చందం లేని మురికి బతుకు బతక్కపోతేనేం?" అంది దురుసుగానే.

రామ్మూర్తి మళ్ళీ మాట్లాడలేదు.

ఒక్కోసారి వర్లక్ష్మికి అతనిమీదా కోపం రాదు. తన కర్మనే తను నిందించుకోవాలనిపిస్తుంది.

★ ★ ★

స్నానంచేసి తడి ఒంటినిండా పల్చటి చీరగుడ్డ చుట్టుకుని గబగబా గదిలోకి వెళ్ళిపోయింది వరలక్ష్మి. రామ్మూర్తి పరాకుగా కాయితాలకోసం గదిలోకి రాబోయాడు. వెనక్కి తిరిగి చూసింది. చీర తీసి ఒంటినిండా కప్పుకుంటూ లేని కోపం నటిస్తూ "ఏమిటా సిగ్గులేనితనం? బట్ట కట్టుకుంటున్నానని తెలీదా? కాస్సేపటి దాకా లోపలికి రాకండి!" అంది.

తప్పు చేసినవాడిలా వెనక్కి తగ్గాడు రామ్మూర్తి — "నువ్వు గదిలోకి వచ్చినట్టు తెలీదు" అన్నాడు.

వరలక్ష్మి చీర అంచులు సరిజేసుకుంటూ కూర్చుంది మంచం మీద.

అతను అలా వెళ్ళిపోతే వరలక్ష్మికి ఏడుపొచ్చినంత పనైంది. పంతం పట్టినట్టు భర్త లోపలికి వచ్చేసి, తన ఒంటి మీద తడి బట్ట లాగేసి, కావిలించుకుని, "నన్ను లోపలికి రావద్దంటావా?" అని నవ్వాలని వరలక్ష్మి ఆశ!

ఆడవాళ్ళు బట్టలు కట్టుకుంటోంటే మొగవాళ్ళు లోపలికి వెళ్ళకూడదన్న సూత్రం మూర్తికి బాగా తెలుసు.

"లక్ష్మీ! అయిందా? రావచ్చునా?" అని అడిగాడు బైటి నించి.

"ఏమిటా కంగారు? ఆగండి" అంది వర్లక్ష్మి.

"డెస్కులో కాయితాలున్నాయి. అవయినా ఇలా గియ్యి."

"అవేమిటో నాకు తెలీవు. అంతకంగారైతే వచ్చి తీసుకోండి."

"రావద్దన్నావుగా?"

"అంటే మాత్రం వొస్తేయేం?"

"అన్ని మాటలూ నువ్వే! చీర కట్టుకోడం అయిందో లేదో చెప్పు!"

వరలక్ష్మికి నవ్వూ, ఏడుపూ కలసి వచ్చాయి.

ఎనిమిదేళ్ళ సంసారంలో అలాంటి సంఘటనలెన్నో! ఒకటా, రెండా? ఏదన్నా గుర్తొస్తే, అప్పుడొచ్చినంత ఏడుపు ఇప్పుడు రాదు!

వర్లక్ష్మి ఎంత మారిందో వర్లక్ష్మికి తెలీదు.

★ ★ ★

పక్కవాటాలోకి శర్మావాళ్ళు వచ్చినప్పటినించీ వర్లక్ష్మి మనసులో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. అతను నల్లగా వున్నా చెయ్యెత్తు మనిషి! బలిష్టంగా వుంటాడు. హుషారుగా వుంటాడు. భార్యతో సరసాలాడుతూ వుంటాడు.

ఎప్పుడూ శర్మని చూడాలనీ, అతనికి వినపడేలాగ నవ్వాలనీ, తనకి తహతహ కలుగుతోన్న సంగతి వర్లక్ష్మికే తెలీదు.

ఇప్పుడు భర్త తన పక్కలో పడుకోకపోయినా వరలక్ష్మికి చింతగా అనిపించడం లేదు. అతన్ని మరచిపోయినట్టే అనిపిస్తోంది. ఎవరో మెదులుతారు మనసులో. తనవేపు చిలిపిగా ఉత్సాహంగా చూసే పురుషుడు! అతను తనని మొదటగా కావిలించుకుంటాడు. తను పెనుగులాడుతుంది. అతను నవ్వు

తాడు. మరింత కావిటేసుకుని ముద్దులు కురిపిస్తాడు. తను అతని చేతుల్లో వాలిపోతుంది. సొక్కిసోలి పోతుంది.

ఆ ఊహలతో ఆనందిస్తూ ఆనందిస్తూ హఠాత్తుగా కెవ్వుమంటుంది. 'ఛీ! ఛీ! ఎవడు వాడు? ఎవడో నా ఒంటిమీద చెయ్యి వేస్తాడా?' అని వొణికిపోతుంది.

కానీ, తనేం చెయ్యగలదు? అంత బలిష్టుడు! అంత దుర్మార్గుడు! అలా ఒడిసిపట్టుకుంటే, ఆ చేతుల్లోంచి బైటపడడం తనవల్ల అవుతుందా? లొంగిపోక తనేం చెయ్యగలదు? అల్లరి చేసుకుంటే ఎవరికి నష్టం?

ఆ చేతులు వరలక్ష్మి భుజాల చుట్టూ ఇంకా ఇంకా పెనవేసుకుంటాయి. వరలక్ష్మి దేహం ఆపాద మస్తకం తియ్యటి బాధతో వేగిపోతుంది. సంతోషమో దుఃఖమో తెలీని కన్నీళ్ళు చెంపల్ని తడిపేస్తాయి. బెదిరిన లేడిలా ఆ పురుషుడి వక్షస్థలానికి కరుచుకు పోతుంది.

"లక్ష్మీ!... లక్ష్మీ! ఏమిటలా ఉలిక్కిపడ్డావు? ఇందాక ఏడ్చావు కూడా" అని భర్త తట్టిలేపాడు ఒకసారి.

భర్త మొహంలోకి వెర్రిదానిలా చూసింది — "కల.... కల... ఎవరో దొంగ! నన్ను... గట్టిగా పట్టుకున్నాడు..."

"భలేదానివి! కలకేనా అంత భయం?"

వరలక్ష్మి కుంగిపోయింది — కలా! కలేనా? నిజం కాదా? అంత మధురమైన కల కలేనా?

తపనగా భర్త గుండెల్లో మొహం దాచుకోబోయింది.

"కలకేనా ఇంత భయం?" అని నవ్వాడు. నెమ్మదిగా ఆమె చేతులు వదిలించుకున్నాడు. ఒత్తిగిలి పట్టెమీదకి జరిగి పడుకున్నాడు.

వరలక్ష్మి కుంగిపోయి జీవచ్ఛవంలా అచేతనంగా వుండిపోయింది. దుఃఖం పొంగుకొస్తోంటే లేచి వరండా మీదకి, చీకట్లోకి వెళ్ళింది. ఛీ! ఎందుకీ బతుకు? ఎందుకు బతుకుతోంది తను? ఎందుకీ నికృష్టపు జన్మ?

వరలక్ష్మి చాలా రాత్రుళ్ళు కళ్ళనీళ్ళతో గడుపుతుంది.

ఆ భర్త, ఆమె సంతోషం గురించి ఎన్నడూ అడగలేదు. ఎప్పుడూ తెలుసుకోలేదు. ఆమె చెప్పనూ లేదు. చెప్పింది అతను అర్థం చేసుకోలేదు. ఆ భర్తకి తన సుఖం, తన స్వార్థం తప్ప, ఏదీ తెలీదు. ఏదీ పట్టదు. ఏదీ అక్కర్లేదు.

కానీ, భార్య సంతోషం తెలియని భర్త అనుభవించే సుఖం ఏమిటి? తపనతో వేగిపోయే స్త్రీ దేహాన్ని కరుచుకుని పడుకునే ఆనందం తెలియని పురుషుడు స్త్రీనించి ఎంత అనుభవిస్తాడు?

వరలక్ష్మిలో కోరికలు రెక్కలు విప్పుకుని ఎగిరే స్థితిలో వున్నాయని ఆ కల వచ్చేవరకూ వరలక్ష్మికే తెలీదు. ఆ రోజునుంచీ వరలక్ష్మి మొగుణ్ణి పరాయి మగవాళ్ళతో పోల్చి చూడటం నేర్చుకుంది ముక్కూ మొహం తెలీని మగవాళ్ళ గురించి ఆలోచించటం అలవాటైపోయింది. ఆ మనిషి ఎవరో తనని బలవంతంగా గుండెల కదుముకున్న కలని వద్దనుకుంటూనే గుర్తుతెచ్చుకుంటుంది. నిజంగా తన జీవితంలో అలా జరిగితే? ఛీ! తను ఒప్పుకుంటుందా? కలలో ఎందుకలా వుండిపోయిందోగానీ, కానీ... ఏమో! అంత బలిష్టమైన హస్తాల నుంచి.... అంత మధురమైన అనుభవం నుంచి... తనెలా బయట పడుతుంది? తన వశం అవుతుందా? అబల....! ఆ పురుష హస్తాల మధ్య చిక్కి నలిగిపోక తనేం చెయ్యగలుగుతుంది? —తను ఏమిటో తనకే అర్థం కాలేదు వరలక్ష్మికి. తెరలు తెరలుగా దుఃఖం కట్టలు తెంచుకుని పొంగి, వరలక్ష్మిని సేదదీర్చింది. ఏడవడం కూడా లేకపోతే వరలక్ష్మికి ఇంకేం వుంటుంది?

★ ★ ★

ముందు వాకిట్లోనో వెనక వాకిట్లోనో శర్మని ఎప్పుడు చూసినా, వరలక్ష్మి మొహం తళతళలాడుతుంది. పెదాల మీద చిరునవ్వూ, కళ్ళల్లో సిగ్గూ, ఆపాద మస్తకం ఒక పులకింతా! అదంతా శర్మకే తెలుసు, వరలక్ష్మికన్నా.

శకుంతలని ఆశ్చర్యంగా చూస్తుంది వరలక్ష్మి. "నువ్వెంత అదృష్టవంతురాలివక్కా!" అంది ఒకసారి అప్రయత్నంగా.

శకుంతల తెల్లబోయి "ఎందుకలా అన్నావు వర

లక్ష్మీ?" అని అడిగితే, వరలక్ష్మి తడబడింది. "ఏమో, నాకలా అనాలనిపించింది" అని నవ్వేసింది. "ఏదైనా పుస్తకం ఇద్దూ! బొత్తిగా తోచడం లేదు" అని మాట మార్చింది.

"ఈ పత్రికలు చూడు" అంటూ నాలుగు పుస్తకాలు పడేసింది శకుంతల.

వరలక్ష్మి వాటిని కాస్సేపు తిప్పిచూసి ఆశ్చర్యపోతూ "ఇదేమిటి? ఇవేం పత్రికలు? సంసారం... దాంపత్య సుఖం... ఛా! ఇవి ఎక్కడివీ?" అంది.

"ఇంకెక్కడిది? ఈయన సరదాలే. నెలనెలా ఈ పత్రిక తెస్తూ వుంటారు. ఆయన చదవటం కాకుండా నేనూ చదివే వరకూ ప్రాణాలు తీస్తారు. చెప్పద్దూ? ఈ పత్రికలు మంచివే వర్లక్ష్మీ! మంచీ చెడ్డా తెలుస్తాయి. పాత పత్రికలు కూడా వున్నాయి కావాలంటే తీసుకో".

శకుంతల ఆ పుస్తకాల గురించి ఏమేమో చెప్తోంటే మంత్రముగ్ధలా వింది వరలక్ష్మి. ఇంట్లోకి వచ్చి మంచం మీద కూర్చుని పత్రికలన్నీ ఆతృతగా చదివింది.

శరీరాల గురించి కొత్త కొత్త విషయాలేవో తెలిసినట్టనిపించింది. సంసారం అంటే తనకిగానీ తన భర్తకిగానీ ఏం తెలుసనిపించింది. ఈ పత్రికలు తన భర్త చదివితే, ఆయనకి తన మీద ప్రేమ పుట్టుకొస్తుందనిపించింది. సముద్రంలో కొట్టుకుపోయే దౌర్భాగ్యుడికి పూల పడవ దొరికినట్టనిపించింది.

ముసి ముసి నవ్వులతో ఆ పత్రికలు భర్త ముందు పెట్టి "శకుంతల ఇచ్చింది. శర్మగారు తెస్తుంటారట. చాలా సంగతులు తెలుస్తున్నాయి. కొన్నాళ్ళు ఇలాంటివి చదివితే డాక్టర్లు అయిపోతాం" అని నవ్వింది.

రామ్మూర్తి, పైన కనపడ్డ పత్రిక తిరగేశాడు — "ఇవి తెలుసులే. శాస్త్రాలు చదివి కాపరాలు చేస్తే ఎలక పిల్లలు పుట్టాయట! భార్యాభర్తల సంగతులు ఒకళ్ళు చెప్పాలా?" అని నవ్వాడు.

"అలా అనకండి! డాక్టర్లకి తెలిసినట్టు మన శరీరాల గురించి మనకి తెలుస్తుందా? చదివి చూడండి. ఏదన్నా తెలిస్తే తెలుస్తుంది, లేకపోతే లేదు. మనకి పోయేదేముంది?"

"సరేలే, ఆదివారంనాడు జ్ఞాపకం చెయ్యి" అన్నాడు పేపరు తిరగేస్తూ.

వరలక్ష్మి కొంచెం నవ్వి "రాత్రికి చదవరాదూ?" అంది.

"సరేలే, జ్ఞాపకం చెయ్యి."

పత్రికలు ఎదురుగా బల్లమీదే పెట్టింది.

సాయంత్రం వాటిని తిరగేశాడు. చాలాసేపు చదివాడు. భోజనాలయ్యాక తన మంచం మీద తను పడుకున్నాడు!

శకుంతల కొత్త పత్రిక ఇవ్వబోతే వరలక్ష్మి "వొద్దులే అక్కా! మా ఆయనకీ సరదాలే లేవు" అంది నీరసంగా నవ్వుతూ.

★ ★ ★

ఎన్నెన్ని సంగతులో గుర్తొస్తున్నాయి. ఒకదాన్ని ఒకటి తీసుకుంటూ! చివరికి మిగిలింది మళ్ళీ ఆ కల! ఆ పురుషుడి కౌగిలి!

రయ్యిమంటూ కిటికీలోంచి కొట్టింది చలిగాలి. వరలక్ష్మి పిట్టలా వణుకుతూ పైటకొంగు ఒంటినిండా కప్పుకుంది. ఆలోచనా వలయాలు చెల్లా చెదురయ్యాయి.

గుడ్డిదీపం వెలుగులో టేబుల్ మీద గడియారం ఒంటిగంటపైగా చూపిస్తోంది. పొడికళ్ళు పడిపోయాయి వరలక్ష్మికి.

ఆగిన వర్షం తిరిగి కుండపోతగా మొదలైంది.

హోరుమంటూ వాన చప్పుడు!

వరలక్ష్మి కూర్చున్న గది తలుపులు తెరుచుకుని మూసుకున్నాయి.

తలెత్తి చూస్తూ తుళ్ళిపడింది వరలక్ష్మి. దిగ్గున మంచందిగి నిలబడిపోయింది.

ఎదురుగా శర్మ!... శర్మగారు! ... నిలువెత్తు మనిషి! కంచు విగ్రహం లాగ! తమ పడక గదిలో! ఇంత అర్ధరాత్రి!

గ్లాస్కో లాల్చీ, తెల్లటి పైజామా! అతని వెంటే సెంటువాసనలు! గుడ్డి వెలుతుర్లో అతని జుట్టు మెట్లు మెట్లుగా మెరుస్తోంది! చేతిలో మల్లెపూల దండ పట్టుకున్నాడు.

"సాయంత్రం బజారుకి వెళ్ళానండీ! పూలు

కనపడ్డాయి. మీరు జానకితో అన్నారుగా పూలు కొనుక్కోవాలని? మీ కోసమే తెచ్చాను" చిలిపిగా చూస్తూ అన్నాడు.

చిత్తరువు లాగా బిగుసుకుపోయిన వరలక్ష్మికి కొంచెం చలనం కలిగింది.

నోటి మాటరానంత ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అయింది.

"పూలు మిమ్మల్ని తెమ్మన్నానా నేను?" అంది చిరుకోపంగా.

శర్మ నవ్వాడు — "అనకపోతేయేం? నేను తేకూడదా?"

"ఇంత అర్ధరాత్రి పూలేవిటి!"

"పూలతో పని అర్ధరాత్రేలే వర్లక్ష్మీ!"

'అదేం పిలుపు?' అన్నట్టు ఆశ్చర్యపోతూ చూసింది.

"నువ్వు నాకు మరదలివే కదా? మరదలిని, బావ, అలా పిలిస్తేనే అందం! నీకిష్టమేగా?" రెండడుగులు ముందుకు వేసి పూలదండ ఇవ్వబోయాడు. అంతలో ఆగి "వెనక్కి తిరుగు. నేనే నీ తల్లో పెడతాను. నువ్వు నా మరదలివే కదా?" అంటూ వరలక్ష్మి దగ్గిరికి చేరి భుజాల మీద చేతులు వెయ్యబోయాడు.

కంగారు పడిపోయింది వరలక్ష్మి. "ఇదేమిటి? మా గదిలోకి మీరు రావటం... ఇంత రాత్రి.... ఇదేం మర్యాద?"

నిర్లక్ష్యంగా నవ్వాడు శర్మ — "మీ ఆడవాళ్ళ చమత్కారాలు నాకు కొత్త కాదులే. ఆకాశం చిల్లులు పడిపోయినట్టు వాన కురుస్తోంటే తలుపులు వేసుకోకుండా ఎందుకు కూర్చున్నావు? సాయంత్రం నాకు వినపడేలా అన్ని మాటలు ఎందుకు మాట్లాడావు? అన్నీ నా కోసమేగా? నీ మనసు అర్థం చేసుకోలేననుకున్నావా?"

కొంచెం కోపంగా చూసింది వరలక్ష్మి. "చాల్లెండి. తలుపులు వేసుకోడం మర్చిపోయానేమో! అందుకని మొగవాళ్ళు లేని సమయం చూసుకుని పరాయి వాళ్ళ గదుల్లోకి జొరబడతారా?"

"నీ మొగవాడు లేని సమయంలో ఇంత ముస్తాబు ఎందుకు చేసుకున్నావు? ఎవరికోసం?"

"అయితే మీకోసం చేసుకున్నాననుకున్నారా? నా ఇంట్లో నేను నా ఇష్టం వచ్చినట్టు చేసుకుంటాను. అడగడానికి మీరెవరు?"

"నేనెవరా? నీ బావని! నువ్వు నా మరదలివి. ఎందుకీ అనవసరపు బెట్టు? ఈ రాత్రంతా సంతోషంగా మాట్లాడుకుందాం. నీ మనసు నాకు తెలియదనుకున్నావా?"

"తెలిసి ఏం చెయ్యగలరు? నా ఇష్టాలన్నీ మీరు తీరుస్తారా?"

"చెప్పు! ఎందుకు తీర్చనూ? నీ చూపులూ నీ నవ్వులూ నన్ను నిలవనిస్తున్నాయా? నిద్ర పట్టనిస్తున్నాయా? మతిపోగొడుతున్నాయి. నా కోసం నువ్వూ, నీ కోసం నేనూ, ఇలా బాధపడడం ఎందుకూ? తెగించి సంతోషపడాలి....."

"మీ కోసం నేను బాధపడుతున్నానని ఎవరు చెప్పారు?"

"నీ కళ్ళు చెప్పాయి. నీ ఒంటి విరుపులు చెప్పాయి. సరేనా? ఇంకా ఎందుకు వర్లక్ష్మీ నిష్టూరాలాడతావు? నీ బావనే కదా? నా మీద దయదల్చు!"

శర్మ నవ్వుతోంటే వరలక్ష్మి కుంచించుకుపోయింది. తనని దోషిగా నిలబెట్టి అపహాస్యం చేస్తున్నట్టు సిగ్గుపడి పోయింది.

"నీకు నిజంగా కోపం వచ్చిందేమిటి" శర్మ వరలక్ష్మి పైటకొంగు అందుకోబోయాడు.

వర్లక్ష్మి బెదిరిన లేడిలా తప్పించుకుంది. చెంగు లాక్కుంది.

"అబ్బో, నిజంగానే కోపం వచ్చిందే మరదలికీ! ఆలశ్యంగా వచ్చాననా?"

"చాల్లెండి, మీకోసం ఇక్కడెవరూ ఎదురు చూడలేదు."

"లేదని ఇప్పుడంటే సరిపోతుందా? సాయంత్రం నీ మాటలన్నీ ఎవరికోసం? మీ ఆయన లేనప్పుడు అదంతా నా కోసమేగా?"

చురుగ్గా చూసింది వరలక్ష్మి — "మీరు ఇంట్లో లేకపోతే మీ ఆవిడ అలాగే చేస్తుందా?"

అతిశయంగా నవ్వాడు శర్మ — "నా భార్యకేం ఖర్మ వేరే మొగవాళ్ళ వేపు చూడడానికి? నా వల్ల సంతోషం లేకపోతే కదా?"

వరలక్ష్మికి మొహం ఎర్రబడింది. "మరి, మీకేం

ఖర్మ వేరే ఆడవాళ్ళవేపు చూడడానికి? ఆవిడ వల్ల సంతోషం లేదా మీకు?"

మాట రానట్టు అయ్యాడు శర్మ — "…. నా సంతోషం కోసం కాదు, నీ సంతోషం కోసమే వచ్చాను. సాయంత్రం అంతా కిలకిలా నవ్వి, నన్ను రెచ్చగొట్టి, ఏమీ ఎరగనట్టు మాట్లాడుతున్నావే!"

"నేను నవ్వితే అది మీకోసమే అనుకున్నారా? మీ భార్య తప్పితే ఇరుగు పొరుగు ఆడవాళ్ళు సంసారాలు చెయ్యడం లేదనా ఇంత తెగించారు?"

"సంసారాలు!" వెటకారంగా నవ్వాడు శర్మ. "సంసారం అంటే తెలిస్తే నీ కళ్ళల్లో ఎందుకంత ఆశ? ఒకరోజు కిలకిలా నవ్వుతావు, ఒకరోజు వలవలా ఏడుస్తావు. నేను గ్రహించలేననుకుంటున్నావా?"

"నా ఖర్మకి నేను ఏడుస్తానూ, నవ్వుతానూ. మీరు గ్రహించి ఏం చేస్తారు? నన్ను ఉద్ధరిస్తారా?"

"ఏమిటి వర్లక్ష్మీ ఇలా పోట్లాడదామనే పిలిచావా? పూలు నీకిష్టం కదా? నీ కోసం ఎంత దూరం వెళ్ళి తెచ్చానో తెలుసా?" అంటూ శర్మ చిలిపిగా చూస్తూ వరలక్ష్మిని కావిలించుకోబోయాడు.

వరలక్ష్మి మొహం ఎర్రబారిపోయింది "ఆగండి, ఇదేం తప్పుడు పని? ఇంత అర్ధరాత్రి మా గదిలోకి వచ్చి ఇవేం మాటలు? పువ్వులు నా మొగుడు తెస్తే సంతోషిస్తానుగానీ మీరు తెస్తే సంతోషిస్తానా?"

"నీ మొగుడు నీ అచ్చట్లూ ముచ్చట్లూ తెలిసిన రకం కాడు కదా? అందుకే నువ్వంటే నిజంగా నాకు చాలా జాలి! నీ కళ్ళలాంటి మత్తెక్కించే కళ్ళు నేనెక్కడా చూడలేదు. నీలాంటి అందగత్తెతో స్వర్గసౌఖ్యాలు అనుభవించవచ్చు కదా అనిపిస్తుంది నాకు. నాతో పోట్లాడ్డానికి పిల్చావా నన్ను చెప్పు?" శర్మ మెత్తగా మాట్లాడుతూ చిరునవ్వుతో చూస్తూ వరలక్ష్మి భుజాల మీద చేతులు వెయ్యబోయాడు.

వరలక్ష్మి కోపంగా చూసింది — "'పిల్చావు, పిల్చావు' అంటారేవిటి? మీ పేరు పెట్టిపిల్చానా నేను? మీకూ నాకూ స్వర్గసుఖాలేమిటి? మీ భార్యకి తెలీకుండా మీరూ, నా భర్తకి తెలీకుండా నేనూ... దొంగల్లాగ... అదా స్వర్గం? ఎప్పుడో మీరిలాగే హఠాత్తుగా గదిలో జొరబడతారు …. మీ దారిన మీరు లేచి పోతారు. …. అంతకన్నా నాకు మీరు గొప్ప సంసారం ఇస్తారా? ఆ మాత్రపు సంసారం నా మొగుడు ఇవ్వడం లేదా? నేను కోరుకునేది అలాంటి సంసారం కాదులెండి!"

"వరలక్ష్మీ! ఇంత కాలానికి ఇంత మంచి అవకాశం దొరికింది. ఎందుకంత భయపడతావు? మా ఆవిడ మూడు నెల్లదాకా రాదు. మీ ఆయన ఇంట్లో వుండడు. ఇంకేం భయం? నా మీద అనవసరంగా కోపం తెచ్చుకుంటున్నావు. మరదలివి కదా అని సరసంగా ఏదో అన్నాను లెద్దూ! నీకష్టం నాకు తెలుసు…. ఇద్దరం ఎంత సుఖపడతామో ఆలోచించు! ... ఈ పూలు చూడు, ఎంత ఘుమఘుమలాడుతున్నాయో!…. మీ ఆయనతో నువ్వేం సుఖపడుతున్నావు? …. నా మాట విను! తప్పులేదు వరలక్ష్మీ! మనం పుట్టింది సుఖపడడానికి కాకపోతే ఎందుకు?" అంటూ వరలక్ష్మి భుజాల మీద చేతులు వేసి, ఆమెని చుట్టుకోబోయాడు.

వరలక్ష్మి కంపరంగా అతని చేతులు తోసేసింది — "మీరిలా చేశారంటే, అరిచి గోలచేస్తాను, ఏమనుకున్నారో! నేనేదో తెలివి తక్కువగా నవ్వానని నన్ను ఇంత లోకువగా అర్థం చేసుకుంటారా? నా మొగుడితో నాకు కష్టమో సుఖమో ఏదో ఒకటి అదే భరిస్తాను. మీతో మాత్రం నాకు దొరికేదేముంది? నేను స్వర్గం లాంటి సంసారం కావాలనుకున్నాను గానీ చాటు మాటు వ్యభిచారం కావాలనుకున్నానా? నా మీద జాలిపడితే పడండిగానీ, నన్ను పాడు చెయ్యడానికి చూడకండి! నా మొగుడితో నాకు ఏ సంతోషమూ లేని మాట నిజమే. కానీ ఇప్పుడాలోచిస్తే ఆయన మీలాంటి శృంగార పురుషుడైతే ఆయనకి నాతో ఆనందం సరిపోయేది కాదు. పరాయి ఆడవాళ్ళ వెంట పడేవాడే! మీరు ఏ ఆడదాని వేపు కళ్ళు తిప్పుతారో అని మీ ఆవిడికి ఎప్పుడూ భయమే. మీ అంత శృంగార పురుషుడితో ఆవిడేం నిశ్చింతగా వుంది? నా మొగుడు నా మొహం చూడకపోతే పోయాడు, మీ ఆవిడ వేపు కళ్ళు తిప్పడు కదా? అది చాలులెండి నాకు. దేనికో దానికి తృప్తిపడాలి కదా? అందరికీ అన్ని సంతోషాలూ దొరుకుతాయా? మీ ఆవిడికీ విచారం లేదా? మీతో ఎంత సంతోషంగా వుంది? ఎప్పుడూ భయమే. ఎప్పుడూ విచారమే. నాకూ విచారమే. తేడా

ఏముంది? పరాయి మొగాళ్ళని కోరుకుంటే సంసారి దొరుకుతాడా, వ్యభిచారే దొరుకుతాడు గానీ. ఆ మనిషి నాతో కలిసి బతుకుతాడా? ఇలా వచ్చి అలా పోతాడు. ఈ భాగ్యానికి నేనెందుకు నవ్వుల పాల వ్వాలీ?...." — వరలక్ష్మి చెంపలు తడిసిపోతున్నాయి.

శర్మ తెల్లబోయి చూస్తూ నోటమాట రానట్టు అయిపోయాడు.

వరలక్ష్మికి కళ్ళనీళ్ళు తుడుచుకుంది "నా నవ్వులూ నా మాటలూ.... వెకిలి మనిషిలాగే చేశాను లెండి. లేకపోతే మా గదిలో జొరబడడానికి మీకింత ధైర్యం వుంటుందా? నా బాధతో నాకలా పిచ్చెత్తింది. ఇప్పటిదాకా నాకు రోజూ చచ్చిపోవాలనే వుండేది. కానీ, మీ భార్య మాత్రం నిజంగా నిశ్చింతగా బతుకు తోందా? పరాయి ఆడవాళ్ళ పిచ్చితో వుండే భర్తతో, ఏ ఆడదానికైనా మనసు కుదురు వుంటుందా? అయినా మీ భార్య బతకడం లేదా? నేనూ అలాగే బతుకు తాను. నా మొగుడు ఎంత బండ మనిషైతే యేమిటి, పరాయి ఆడవాళ్ళ గదుల్లోకి దూరే రకం కాదు. అది చాలులెండి నాకు. ఆయన వల్ల నేను ఒక్కరోజు సంతోషపడకపోయినా... పోనీలెండి ... నా అదృష్టం అది .... అదే భరిస్తాను .... మీ ఆవిడ భరిం చడం లేదూ మిమ్మల్ని? నాకన్నా ఎక్కువ అదృష్టవంతురాలా ఆవిడ? .... ఆవిడికి మీ భయంతో నిద్రే వుండదు. ఎప్పుడూ గుండెలు అదురుతూనే వుంటాయేమో! నేనే నయం. ఆవిడకన్నా శాంతంగా నిద్రపోతాను" — వరలక్ష్మి కళ్ళనీళ్ళతో తెగ మాట్లాడింది.

శర్మ కొయ్యబారినట్టు నిలబడిపోయాడు. చేతుల్లో పూలదండ నేలమీద పడిపోయింది ఎప్పుడో!

"మీరిప్పుడు నాకు 'బావగారు' కాదులెండి. పిచ్చిదాన్ని. అప్పుడేదో అలాంటి వరస పెట్టుకున్నాను. ఆ అలుసు చూసి నన్ను బాధ పెట్టకండి! మిమ్మల్ని ఇక ఎప్పుడూ 'అన్నయ్య గారూ' అని పిల్చుకుంటాను. నన్ను తప్పుడు మనిషిలాగా అనుకోకండి...."

శర్మ సిగ్గుపడిపోతున్నట్టు చూశాడు — "నేను నిన్ను చాలా అపార్థం చేసుకున్నట్టున్నాను......"

"లేదు, తప్పు మీదే కాదు, నాది కూడా. నన్ను నేనే అపార్థం చేసుకున్నాను. నేనే నా మనసుని అర్థం చేసుకోలేకపోయాను. మీ దయవల్ల ఇప్పుడే కదా నాకు నేను అర్థమవుతున్నాను? నలుగురి కళ్ళూ కప్పి చాటు మాటు బతుకు బతికేదాన్ని కాకూడదని ఇప్పుడే కదా నేర్చుకున్నాను?"

శర్మ కొయ్యబారినట్టు నిలబడ్డాడు తలదించి.

"మీరు వెళ్ళండి అన్నయ్యగారూ! ఇక మిమ్మల్ని నేను అలాగే పిల్చుకుంటాను. ఈ పిలుపు వదిన వింటే చాలా సంతోషిస్తుంది."

శర్మ వొంగి నేలమీద పూలదండ తీసుకున్నాడు — "క్షమించు వరలక్ష్మీ! చాలా తప్పు చేశాను ..... వెళ్తాను" అంటూ చకచకా గదిలోంచి వెళ్ళిపోయాడు.

వరలక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ తలుపులు మూసుకుంది.

[1964 అక్టోబరు 'యువ' మాస పత్రికలో] ★

## ఈ కథ గురించి:

ఈ కథకి మొదట పెట్టిన పేరు — 'నాకు చచ్చిపోవాలని వుంది!' దాన్ని ఇప్పుడు '....... ఉండేది'గా మార్చాను. ఎందుకంటే, ముగింపులో ఆ రకంగా కొంచెం మార్పు జరిగింది.

గత ముగింపులో, వరలక్ష్మి, శర్మని 'నాకు కొంచెం విషం ఇవ్వండి. నాకు చచ్చిపోవాలని వుంది' అని అడుగుతుంది. కానీ, ఈ ముగింపులో, వరలక్ష్మి, తనకు ఒక రకమైన కష్టం వుంటే, శర్మ భార్యకి ఇంకో రకమైన కష్టం వుంది — అని ఆలోచించగలుగుతుంది. తన కష్టానికి పరిష్కారం, వ్యభిచారం కాదని కూడా అర్థం చేసుకుంటుంది. తనకు తన భర్తతో సంతోషం ఎప్పటికీ వుండదని ఆమెకి తెలుసు. అయినా, శర్మ భార్య తన కన్నా ఎక్కువ సంతోషంగా వుండలేదు — అని అర్థమై ఆమె, తన కష్టాన్ని సహించుకోడానికే సిద్ధమైంది. 'శర్మ భార్య ఎంతో సుఖపడిపోతోంది' అనే భ్రమ పోవడమే ఆమెకి ఒక రకం సహనాన్ని ఇచ్చింది. 'చచ్చిపోవాలనే' ఆలోచన మారింది. ముగింపులో ఈ మార్పు చెయ్యడం వల్ల, కథ పేరు అలా మార్చాను.

28-6-2004